# రాహుల్‌కు రాంరాం

- ఆయన నాయకత్వ పటిమపై ఇండియా భాగస్వామ్య పార్టీల్లో సడలిన నమ్మకం
- మమతాబెనర్జీకి జై కొడుతున్న కూటమి నేతలు
- మద్దతు ప్రకటించిన లాలూ, తేజస్వీ యాదవ్
- ఆమె వైపే అఖిలేశ్, శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే
- తటస్థ పార్టీ వైసీపీ నుంచీ ఊహించని మద్దతు
- కూటమిలో ముదిరిన 'నాయకత్వ' వివాదం





న్యూఢిల్లీ, డిసెంబర్ 10: ఇండియా కూటమిలో నాయకత్వ లొల్లి ముదురుతున్నది. ఇటీవలి హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో దారుణ ఓటమితో కాంగ్రెస్, రాహుల్ గాంధీ నాయకత్వ పటిమపై కూటమి పార్టీల్లో నమ్మకం సడలింది. హస్తం పార్టీ నేతృత్వంలో బీజేపీని ఎదుర్కోవడం కష్టమే అనే భావనకు ప్రతిపక్ష కూటమి పార్టీలు వచ్చేశాయి. ఇంకా కాంగ్రెస్, రాహుల్ గాంధీ నాయకత్వంలో నడిస్తే తామూ మునిగిపోతామని ఆయా పార్టీల నేతలు మథనపడుతున్నారు. ప్రత్యామ్నాయంగా మమతా బెనర్జీ నాయకత్వానికి జై కొడుతున్నారు. అవకాశం ఇస్తే ఇండియా కూటమిని నడిపిస్తానని మమత చేసిన వ్యాఖ్యలకు కూటమి పార్టీల నుంచి అనూహ్య మద్దతు లభిస్తున్నది. ఇప్పటికే సమాజ్‌వాదీ పార్టీ, ఎన్సీపీ(శరద్‌చంద్ర పవార్), శివసేన(యూబీటీ) నాయకులు మమత నాయకత్వాన్ని ఆహ్వానించారు. ఇండియా కూటమి పగ్గాలు ఆమెకు అప్పగించాలనే డిమాండ్‌ను వినిపించారు. తాజాగా ఈ జాబితాలో ఆర్జేడీ కూడా చేరింది.

**మమతకు ఆర్జేడీ, వైసీపీ మద్దతు**

ఇండియా కూటమి నాయకత్వంపై ఆర్జేడీ అధినేత, బీహార్ మాజీ సీఎం లాలూప్రసాద్ యాదవ్ మంగళవారం కీలక వ్యాఖ్యలు చేశారు. 'మమతా బెనర్జీకి మేము మద్దతు ఇస్తాం. ఇండియా కూటమికి నాయకత్వం వహించడానికి ఆమెకు అనుమతి ఇవ్వాలి' అని ఆయన వ్యాఖ్యానించారు. మమత నాయకత్వానికి కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేస్తుందా? అని ఆయనను ప్రశ్నించగా.. కాంగ్రెస్ వ్యతిరేకించడం సమస్యేమీ కాదని ఆయన కుండబద్దలు కొట్టారు. మరోవైపు ఆర్జేడీ కీలక నేత, లాలూ కుమారుడు తేజస్వీ యాదవ్ సైతం ఇండియా కూటమిని మమత నడిపించడానికి తమకేమీ అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. అయితే, ఈ నిర్ణయం ఏకాభిప్రాయం ద్వారానే జరగాలని ఆయన పేర్కొన్నారు. మరోవైపు ఇంతకాలం ఇండియా కూటమి, ఎన్డీఏలో లేకుండా తటస్థంగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం మమతా బెనర్జీకి మద్దతు తెలపడం ఆసక్తికరంగా మారింది. ఇండియా కూటమికి నాయకత్వం వహించేందుకు మమత సరైన వ్యక్తి అని, 42 లోక్‌సభ స్థానాలు కలిగిన పెద్ద రాష్ట్రానికి ఆమె ముఖ్యమంత్రి అని, ఎన్నికల్లో ఆమె తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారని వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి 'ఎక్స్'లో పేర్కొన్నారు.

**మమతకు నాయకత్వం అప్పగించాలి: టీఎంసీ**

ఇండియా కూటమిలోని పార్టీల మద్దతుతో తృణమూల్ కాంగ్రెస్ సైతం స్వరం పెంచింది. కాంగ్రెస్ పార్టీ తన అహాన్ని పక్కన పెట్టి ఇండియా కూటమి నాయకత్వాన్ని మమతా బెనర్జీకి అప్పగించాలని టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ డిమాండ్ చేశారు. 'కాంగ్రెస్ నాయకత్వంలో ఇండియా కూటమి విఫలమైందని ఆ పార్టీ అర్థం చేసుకోవాలి. మమతకు రాజకీయ యుద్ధాల్లో ఎలా పోరాడాలో తెలుసు. కాంగ్రెస్ పార్టీ తన అహంతో మమతను వదులుకున్నది. ఇప్పుడు ఆమె ఎలా రాజకీయాల్లో రాణిస్తున్నారో చూస్తున్నాం. మమతకు ఇండియా కూటమి నాయకత్వాన్ని అప్పగిస్తే చాలా మేలు' అని ఆయన పేర్కొన్నారు.

**ఇరకాటంలో పడ్డ కాంగ్రెస్**

ఇండియా కూటమిలో తమ నాయకత్వానికి ఎసరు వస్తుండటంతో కాంగ్రెస్ పార్టీ ఇరకాటంలో పడింది. దీంతో మమతా బెనర్జీపై ఎదురుదాడిని ప్రారంభించింది. మమతకు ఇండియా కూటమి నాయకత్వం అప్పగించాలనే సూచనను 'జోక్'గా కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ అభివర్ణించారు. బెంగాల్ బయట తృణమూల్ కాంగ్రెస్ ఎలాంటి ఫలితాలను సాధించిందని ఆయన ప్రశ్నించారు. గోవా, త్రిపుర, మేఘాలయ, అస్సాం, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్‌లో ఏం సాధించిందో తృణమూల్ స్పష్టత ఇవ్వాలని పేర్కొన్నారు.



70 ఏండ్లు, అంతకన్నా ఎక్కువ వయసు కలిగిన వృద్ధులకు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆయుష్మాన్ భారత్' పథకం ఓ ఆరోగ్య సంజీవనిగా మారింది.

**2018లో తీసుకొచ్చిన ఈ పథకం ప్రయోజనాలను 70 ఏండ్లు పైబడిన వృద్ధులకు కూడా వర్తింపజేసేలా ఇటీవలే మార్పులు చేశారు. తాజా నిర్ణయంతో దేశంలోని 4.5 కోట్ల కుటుంబాల్లో ఉన్న సుమారు 6 కోట్ల మంది వృద్ధులకు లబ్ధి చేకూరే వెసులుబాటు కలిగింది. ఈ నేపథ్యంలో ఆయుష్మాన్ భారత్ సీనియర్ సిటిజన్ ఆరోగ్య బీమా (ఏబీపీఎంజేఏవై-సీనియర్ సిటిజన్) పథకంపై సమగ్ర వివరాలు..**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ):

**కుటుంబంలో ఎంత మంది ఉన్నా వర్తింపు**

# ఆయుష్మాన్‌భవ!

## 70 ఏండ్లు పైబడిన వారందరికీ రూ. 5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా

## ఆదాయం, సామాజిక స్థితి, వృత్తితో సంబంధం లేకుండా ఆయుష్మాన్ భారత్

**ఏమిటీ పథకం?**

దేశంలో 70 ఏండ్లు, ఆపైబడిన వయసు వారందరికీ రూ.5 లక్షల ఉచిత వార్షిక ఆరోగ్య బీమా కవరేజీ ఇవ్వడమే ఏబీపీఎంజేఏవై-సీనియర్ సిటిజన్ స్కీమ్ లక్ష్యం.

**ఎవరు అర్హులు?**



ఈ పథకంలో చేరడానికి ఆర్థిక స్థోమత, సామాజిక స్థితి, వృత్తి ఇలా ఏ అంశాలనూ పరిగణనలోకి తీసుకోరు. 70 ఏండ్ల వయసు పైబడిన పురుషుడు, మహిళ ఎవరైనా ఈ పథకంలో చేరొచ్చు.

**ఏయే పత్రాలు సమర్పించాలి?**

వయసు ధ్రువీకరణ కొరకు ఆధార్ కార్డు ఒక్కటి ఉంటే చాలు. మరే ఇతర పత్రాలు అవసరం లేదు.

**దరఖాస్తు ఎలా చేసుకోవాలి?**



https://beneficiary.nha.gov.in/ పోర్టల్ ద్వారా పీఎంజేఏవై పథకానికి దరఖాస్తు చేయవచ్చు. ఆండ్రాయిడ్ యూజర్లు ఆయుష్మాన్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని దరఖాస్తు చేసుకోవచ్చు.

**పథకంలో చేరినట్టు రుజువేంటి?**

పథకంలో చేరినవారికి ప్రత్యేకంగా ఆయుష్మాన్ వయ వందన కార్డును అందజేస్తారు. డిజిటల్ కార్డులూ అందుబాటులో ఉన్నాయి.

**ఎక్కువ మంది ఉంటే నమోదు ఎలా?**

ఒకే కుటుంబంలో ఒకరి కన్నా ఎక్కువ మంది అర్హులు ఉంటే, మొదటి వ్యక్తి వివరాలను ముందుగా నమోదు చేయాలి. ఆ తర్వాత 'యాడ్ మెంబర్'పై క్లిక్ చేసి మరొకరి వివరాలను నమోదు చేయాలి. ఒక్కొక్కరికి వేర్వేరుగా నమోదు చేయనక్కర్లేదు.

**కుటుంబంలో ఎక్కువ మంది వృద్ధులు ఉంటే?**

ఒకే కుటుంబంలో ఒకరి కన్నా ఎక్కువ మంది అర్హులైన వృద్ధులు ఉంటే, వారంతా కలిసి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స పొందవచ్చు. ఉదాహరణకు ఒక కుటుంబంలో ఇద్దరు వృద్ధులు ఉంటే వారికి సగం, సగం ప్రయోజనం చేకూరుతుంది. అంటే, కుటుంబానికి రూ.5 లక్షల వరకు మాత్రమే లబ్ధి పొందడానికి వీలవుతుందన్న మాట.

**ఇప్పటికే కుటుంబం ఆయుష్మాన్ స్కీమ్‌లో నమోదై ఉంటే?**

ఇప్పటికే ఆయుష్మాన్ పథకం వర్తిస్తున్న కుటుంబాల్లో 70 ఏండ్లు, ఆ పైబడిన వారుంటే.. వారికి అదనంగా ఏడాదికి రూ.5 లక్షల బీమా సౌకర్యం లభిస్తుంది.

**ఈ స్కీమ్‌లో ఎన్ని దవాఖానలు ఎన్‌రోల్ అయ్యాయి?**

నవంబర్ 1 వరకు ఉన్న డాటా ప్రకారం.. దేశవ్యాప్తంగా 16,691 ప్రభుత్వ దవాఖానలు, 13,078 ప్రైవేటు దవాఖానలు ఈ పథకం కింద నమోదయ్యాయి.

**స్కీమ్ మళ్లీ మార్చుకోవచ్చా?**


ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం నుంచి వైదొలగి, ఏబీపీఎంజేఏవైలో చేరినవారు మళ్లీ ఆ ప్రభుత్వ ఆరోగ్య పథకానికి వెనక్కి మారడానికి వీలుండదు. ఏబీపీఎంజేఏవైలోనే కొనసాగాల్సి ఉంటుంది.

**ప్రైవేటు ఉద్యోగుల పరిస్థితి?**

ప్రైవేటు వైద్య ఆరోగ్య బీమా, కార్మిక రాజ్య బీమా (ఈఎస్ఐ) పథకం కింద ప్రయోజనం పొందుతున్న వారు వాటిని కొనసాగిస్తూనే ఈ పథకంలోనూ చేరొచ్చు. అలా అదనంగా రూ.5 లక్షల ఆరోగ్య బీమా ప్రయోజనం పొందొచ్చు.

**ప్రభుత్వ ఉద్యోగుల మాటేమిటి?**

సీజీహెచ్ఎస్, ఎక్స్‌సర్వీస్‌మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్‌స్కీమ్, ఈసీహెచ్ఎస్, ఆయుష్మాన్ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సీఏపీఎఫ్) పథకాల కింద ఉన్న వయో వృద్ధులు వాటిని కానీ, ఏబీపీఎంజేఏవైని కానీ ఏదైనా ఒకటి ఎంచుకోవచ్చు.



**చేరిన వెంటనే చికిత్స పొందవచ్చా?**

పీఎంజేఏవై పథకంలో చేరిన మొదటి రోజు నుంచే చికిత్స పొందడానికి అర్హులు. చికిత్స కోసం వెయిటింగ్ పీరియడ్ నిబంధన లేదు. కాబట్టి ఈ బీమా కవరేజ్ తక్షణమే ప్రారంభమవుతుంది.

**ఎన్ని రకాల చికిత్సలు అందుబాటులో?**



డయాలిసిస్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్, ఆర్థోపెడిక్ సర్జరీల వంటి 1,949 మెడికల్ ప్రొసీజర్లు, జనరల్ మెడిసిన్, సర్జరీ, ఆంకాలజీ, కార్డియాలజీ వంటి 27 మెడికల్ స్పెషాలిటీలతో పాటు 750కి పైగా అరుదైన చికిత్సలు ఈ పథకం కింద అందుబాటులో ఉన్నాయి.


**ఏమైనా డబ్బులు చెల్లించాలా?**

ఈ పథకం పూర్తిగా నగదు రహితమైనది. స్కీమ్ కవరేజీ కలిగిన ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానలో పేరును నమోదు చేసుకొని ఒక్క పైసా కూడా చెల్లించకుండా వైద్య సేవలను పొందొచ్చు. ఏదైనా చికిత్స కోసం దవాఖానలో చేరే అవసరం ఏర్పడితే, మూడు రోజుల ప్రీ-హాస్పిటలైజేషన్ (కన్సల్టెన్సీ ఫీజు, టెస్టులు)తో పాటు 15 రోజుల పోస్ట్-హాస్పిటలైజేషన్ ఖర్చులు కూడా ఈ స్కీమ్ పరిధిలోకే వస్తాయి.

**టెస్టులు, మందుల మాటేమిటి?**

వైద్య సేవల్లో భాగంగా నిర్వహించే టెస్టులు, మందులు కూడా ఈ స్కీమ్ కింద ఉచితంగానే ఇస్తారు. ఇంకా.. ఈ స్కీమ్ పరిధిలో ఏయే సేవలు ఉచితంగా అందుతాయంటే??





- మెడికల్ ఎగ్జామినేషన్, డాక్టర్ కన్సల్టేషన్, ఓటీ, సర్జన్ ఫీజు, ట్రీట్మెంట్
- ప్రీ-హాస్పిటలైజేషన్ (3 రోజులు)
- మందులు, మెడికల్‌కు సంబంధించిన వస్తువులు
- ఐసీయూ, నాన్-ఐసీయూ
- డయాగ్నోస్టిక్స్ అండ్ లాబోరేటరీ ఇన్వెస్టిగేషన్స్
- మెడికల్ ఇంప్లాంటేషన్ సర్వీసులు
- రూమ్ ఫెసిలిటీ (వసతి)
- ఆహారం
- చికిత్స సమయంలో తలెత్తే ఆరోగ్య సమస్యలు
- పోస్ట్-హాస్పిటలైజేషన్ (15 రోజులు)

## పీఎం కిసాన్ సాయాన్ని పెంచే యోచన లేదు

**స్పష్టం చేసిన కేంద్రం**

న్యూఢిల్లీ, డిసెంబర్ 10: రైతులకు ఆర్థిక సహాయంగా కేంద్రం ప్రతి ఏడాది పీఎం-కిసాన్ పథకం కింద అందజేస్తున్న ఆరు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పెంచే ప్రతిపాదన ఏదీ లేదని వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ స్పష్టం చేశారు. ప్రతి ఏడాది కేంద్రం రూ.2 వేలు చొప్పున మూడు విడతలుగా రూ.6 వేలను రైతులకు అందజేస్తున్నది. లోక్‌సభలో మంత్రి లిఖిత పూర్వకంగా సమాధానం ఇస్తూ ఈ పథకం కింద ఇప్పటివరకు 18 విడతల్లో రూ.3.46 లక్షల కోట్లను రైతులకు అందజేసినట్టు చెప్పారు. దళారుల ప్రమేయం లేకుండా రైతుల ఖాతాల్లో ఈ మొత్తాన్ని నేరుగా వేస్తున్నట్టు ఆయన తెలిపారు.

## బర్డ్ ఫ్లూతో మరో మహమ్మారి!

**శాస్త్రవేత్తల హెచ్చరిక**

న్యూఢిల్లీ, డిసెంబర్ 10: అమెరికాలోని జంతువుల్లో హెచ్5ఎన్1 బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తి అత్యంత వేగంగా ఉందని, వైరస్ వ్యాప్తిని అడ్డుకోకపోతే ప్రపంచం మరో మహమ్మారిని ఎదుర్కోవాల్సి వస్తుందని సైంటిస్టులు హెచ్చరించారు. బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తిపై కాలిఫోర్నియాలోని 'స్క్రిప్స్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. 'మానవుల మధ్య వైరస్ సోకిన దాఖలా ఇప్పటివరకు లేదు. అయితే ఆ పరిస్థితి ఎంతో దూరంలో లేదు. ఒకవేళ మానవుల్లో వ్యాప్తి మొదలైతే మహమ్మారిగా మారే ప్రమాదముంది. ఇప్పటివరకు ఈ వైరస్ సోకినవాళ్లలో 50 శాతం మంది మృత్యువాత పడ్డారు' అని నిపుణులు పేర్కొన్నారు. హెచ్5ఎన్1 బర్డ్ ఫ్లూ వ్యాప్తి ఇప్పటివరకు జంతువులకే పరిమితమైంది. ఒకే ఒక్క మ్యుటేషన్ గనుక వైరస్‌లో ఏర్పడితే.. అది మానవుల మధ్య వైరస్ వ్యాప్తికి దారితీస్తుంది.

## ఎంఆర్ఎన్ఏ కొవిడ్ టీకాలతో మరణ ముప్పు!

వైద్య నిపుణులు హెచ్చరిక

**నిలిపివేయాలని సూచన**

న్యూఢిల్లీ, డిసెంబర్ 10: 'మెసెంజర్ ఆర్ఎన్ఏ' (ఎంఆర్ఎన్ఏ) కొవిడ్ టీకాలతో మరణించే ముప్పు, శారీరక వైకల్యం బారిన పడే అవకాశముందని ప్రపంచవ్యాప్తంగా వైద్య, ఆరోగ్య నిపుణులు హెచ్చరించారు. ఎంఆర్ఎన్ఏ తరహా కొవిడ్ టీకాల వినియోగాన్ని వెంటనే నిలిపివేయాలంటూ వైద్య, ఆరోగ్య నిపుణులు సంతకం చేసిన 'హోప్ అకార్డ్' పిటిషన్ తాజాగా పిలుపునిచ్చింది. దీని వల్ల అనేక ప్రమాదాలు ఉన్నట్టు సాక్ష్యాలు ఉన్నాయని పేర్కొన్నది. టీకాలపై తిరిగి సమగ్రమైన మూల్యాంకనం జరపాలని వైద్య నిపుణులు అభిప్రాయపడ్డారు. సంప్రదాయ టీకాలకు భిన్నమైనవి 'మెసెంజర్ ఆర్ఎన్ఏ' (ఎంఆర్ఎన్ఏ) టీకాలు. వీటితో ఏర్పడే దుష్ప్రభావాల్ని పూర్తిగా అధ్యయనం చేయకుండా వినియోగంలోకి తీసుకొచ్చారని పలు అధ్యయనాలు సైతం తెలిపాయి.

# ఎస్‌ఎం కృష్ణ కన్నుమూత

- అనారోగ్యంతో తుదిశ్వాస
- కర్ణాటక ముఖ్యమంత్రిగా, విదేశాంగ మంత్రిగా ఎనలేని సేవలు
- ప్రధాని సహా ప్రముఖుల సంతాపం



బెంగళూరు: కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, మాజీ విదేశాంగ మంత్రి ఎస్ఎం కృష్ణ కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం బెంగళూరులో తుదిశ్వాస విడిచారు. 92 ఏండ్ల ఎస్ఎం కృష్ణ.. కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం ఆయన సొంత జిల్లా మండ్యలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరగనున్నాయి. ఎస్ఎం కృష్ణ మృతికి ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన క్యాబినెట్ సహచరులు ఎస్ జైశంకర్, నిర్మలా సీతారామన్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తదితరులు సంతాపం ప్రకటించారు. కర్ణాటక సర్కారు మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది.

**30 ఏండ్లకే అసెంబ్లీలోకి..**

మృదుభాషి, ఉన్నతి విద్యావంతుడైన సోమనహళ్లి మల్లయ్య కృష్ణ 1962లో కర్ణాటకలోని మద్దూర్ నుంచి స్వతంత్ర ఎమ్మెల్యేగా గెలుపొంది 30 ఏండ్లకే అసెంబ్లీలో అడుగుపెట్టారు. అనంతర కాలంలో కాంగ్రెస్‌లో చేరి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, విదేశీ వ్యవహారాల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. బెంగళూరును ఐటీ హబ్‌గా తీర్చిదిద్దడంలో కృష్ణ పాత్ర ఎనలేనిదని ఐటీ రంగ నిపుణులు చెబుతారు. 1968లో సోషలిస్టు ఎంపీగా 4వ లోక్‌సభలోకి మొదటిసారి అడుగుపెట్టారు. 1972లో ఆయన రాష్ట్ర రాజకీయాలకు తిరిగిరావలసి వచ్చింది. 1980లో మళ్లీ లోక్‌సభలోకి అడుగుపెట్టిన కృష్ణ 1983-84లో కేంద్ర పరిశ్రమల శాఖ సహాయ మంత్రిగా, 1984-85లో ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. తర్వాత కర్ణాటక అసెంబ్లీ స్పీకర్‌గా, ఉప ముఖ్యమంత్రిగా రాజ్యసభ సభ్యునిగా, కర్ణాటక ముఖ్యమంత్రిగా ఆయన పనిచేశారు. అనంతరం మహారాష్ట్ర గవర్నర్‌గా, విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2017లో బీజేపీలో చేరిన కృష్ణ 2023లో రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకున్నారు.

**కెనడీ తరఫున ప్రచారం..**

అప్పట్లో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన డెమోక్రాట్ అభ్యర్థి జాన్ ఎఫ్ కెనడీ కోసం కృష్ణ ప్రచారం చేశారు. ఆ ఎన్నికల్లో గెలుపొందిన కెనడీ భారతీయుల ఓట్లు తనకు లభించేందుకు కృష్ణ చేసిన కృషిని కొనియాడారు.

# స్టూడెంట్ వీసాలకు అమెరికా కోత!

**గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 38 శాతం తగ్గుదల**

ట్రంప్ పాలనలో భారత విద్యార్థులకు మరింత కష్టకాలం

న్యూఢిల్లీ: ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో భారతీయ విద్యార్థులకు అమెరికా జారీచేసే వీసాల సంఖ్య భారీ స్థాయిలో తగ్గిపోయింది. 2024 సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో భారతీయ విద్యార్థులకు జారీ చేసిన ఎఫ్-1 స్టూడెంట్ వీసాలలో 38 శాతం తగ్గుదల ఉంది. గత ఏడాదితో పోలిస్తే ఇదే కాలంలో కొవిడ్ తర్వాత ఇంత భారీ స్థాయిలో వీసాల తగ్గుదల కనిపించడం ఇదే మొదటిసారి. కొవిడ్ తర్వాత అమెరికాలోని అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలలో అంతర్జాతీయ విద్యార్థుల చేరికలో పెరుగుదల కనిపించింది. ఇతర దేశాల స్టూడెంట్ వీసాల జారీలో స్వల్పంగా తగ్గుదల ఉండగా భారతీయ విద్యార్థులకు జారీ చేసిన వీసాల సంఖ్యలో మాత్రం గణనీయమైన పెరుగుదల ఉంది. ఇప్పటికే కఠినంగా ఉన్న అమెరికా వీసా నిబంధనలు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో మరింత కఠినంగా మారే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

**కొవిడ్ తర్వాత తొలిసారి తగ్గుదల..**

కొవిడ్ తర్వాత మొట్టమొదటిసారి భారతీయ విద్యార్థుల ఎఫ్-1 వీసాలలో భారీ తగ్గుదల ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2024 జనవరి, సెప్టెంబర్ మధ్య కేవలం 64,008 వీసాలు మాత్రమే జారీ అయ్యాయి. 2023లో ఇదే కాలంలో 1,03,495 వీసాలు జారీ కాగా 2021లో 65,235 వీసాలు, 2022లో 93,181వీసాలు జారీ అయ్యాయి. కొవిడ్ ప్రబలిన 2020 సంవత్సరం తొలి 9 నెలల్లో 6,646 ఎఫ్-1 వీసాలు మాత్రమే జారీ అయ్యాయి. ఇతర దేశస్తులతో పోలిస్తే చైనా విద్యార్థులకు అమెరికా జారీ చేసే ఎఫ్-1 వీసాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది.

**అమెరికాలో 3.31 లక్షల మంది భారత విద్యార్థులు**

అమెరికా సంస్థలలో విద్యాభ్యాసం చేసే విద్యార్థుల కోసం అమెరికా విదేశాంగ శాఖ ఎఫ్-1 వీసాలను జారీ చేస్తుంది. 2022-2023 ఆర్థిక సంవత్సరంలో కొత్త విద్యార్థి వీసాల జారీలో భారత్ చైనాను మించిపోయింది. ఓపెన్ డోర్స్ 2024 నివేదిక ప్రకారం అమెరికా యూనివర్సిటీలలో చదువుకుంటున్న భారతీ విద్యార్థుల సంఖ్య 2023-24 విద్యా సంవత్సరంలో 3.31 లక్షలు ఉంది. అమెరికాలోని మొత్తం అంతర్జాతీయ విద్యార్థి జనాభాలో ఇది 29.4 శాతంగా ఉండడం విశేషం.

## పర్యావరణ విద్యలో టాప్-50లో ఐఐఎస్సీ

**క్యూఎస్ వరల్డ్ ర్యాకింగ్స్-2025 విడుదల**

న్యూఢిల్లీ: భారత్‌లోని యూనివర్సిటీల్లో సుస్థిరత అంశంలో ఐఐటీ ఢిల్లీ అగ్ర స్థానంలో నిలిచింది. క్యూఎస్ ప్రపంచ ర్యాకింగ్స్-2025లో 255 స్థానాలు ఎగబాకి 171 స్థానానికి చేరుకుంది. మంగళవారం ఈ ర్యాంకులను విడుదల చేశారు. ఈ జాబితాలో 78 భారత విశ్వవిద్యాలయాలకు స్థానం దక్కింది. దేశంలోని టాప్ టెన్ విద్యా సంస్థల్లో తొమ్మిది తమ ర్యాంకులను మెరుగుపరుచుకోగా, కొత్తగా 21 సంస్థలు స్థానం దక్కించుకొన్నాయి. పర్యావరణ ప్రభావం అంశంలో ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ కాన్పూర్ టాప్-100లో చోటు సంపాదించాయి. ఐఐఎస్సీ, బెంగళూరు పర్యావరణ విద్యలో టాప్-50లో చోటు దక్కించుకుంది. భారత యూనివర్సిటీలు సుస్థిరత అంశంలో చూపుతున్న చొరవను క్యూఎస్ ర్యాకింగ్స్ ప్రశంసించింది.

## ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్‌పై అవిశ్వాసం

మొదటిపేజీ తరువాయి...

పేర్కొంది. అవిశ్వాస తీర్మానానికి కనీసం 50 మంది ఎంపీల సంతకాలు అవసరం కాగా, కాంగ్రెస్, ఆర్జేడీ, టీఎంసీ, సీపీఐ, సీపీఎం, జేఎంఎం, ఆప్, డీఎంకే తదితర పార్టీలకు చెందిన 60 మంది విపక్ష ఎంపీలు ఈ తీర్మానంపై సంతకాలు చేశారు. అయితే కాంగ్రెస్‌లోని రాజ్యాంగ పదవుల్లో ఉన్న అగ్రనేతలు ఈ నోటీసుపై సంతకాలు చేయలేదు. అలా చేయని వారిలో సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గేతో పాటు ఇతర పార్టీల నేతలు కూడా ఉన్నారు.

**ధన్‌ఖడ్ నిబద్ధతతో పనిచేస్తున్నారు: రిజిజు**

రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌పై విపక్షాలు అవిశ్వాస తీర్మానం పెట్టడం చాలా విచారకరం అని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. అవిశ్వాస తీర్మానం నెగ్గడానికి 243 మంది సభ్యుల మద్దతు అవసరం. అయితే విపక్షాలకు ఆ సంఖ్య లేకపోవడంతో ఈ తీర్మానం నామమాత్రమేనని భావిస్తున్నారు.

'సీయూఈటీ-యూజీ'లో

# సమూల మార్పులు

- *ఏ సబ్జెక్టునైనా ఎంచుకునే అవకాశం*
- *12వ తరగతి సబ్జెక్టుతో పని లేదు!*
- *సీబీటీ పద్ధతిలో 60 నిమిషాల పరీక్ష*



*న్యూఢిల్లీ, డిసెంబర్ 10: వివిధ కళాశాలల్లో అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి దేశవ్యాప్తంగా నిర్వహించే సీయూఈటీ-యూజీ పరీక్షలో సమూల మార్పులు చేస్తున్నట్టు యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ ప్రకటించారు. మంగళవారం ఆయన దీని వివరాలు 'పీటీఐ'కి వెల్లడించారు. గత ఏడాది హైబ్రిడ్ పద్ధతిలో కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్టు(సీయూఈటీ) నిర్వహించగా, 2025 నుంచి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) పద్ధతిలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇక మీదట 12వ తరగతిలో చదివిన సబ్జెక్టుతో సంబంధం లేకుండా సీయూఈటీ-యూజీ పరీక్షకు ఏ సబ్జెక్టునైనా ఎంచుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు 63 సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహిస్తుండగా, ఇక మీదట 37 సబ్జెక్టులకు తగ్గించనున్నట్టు చెప్పారు. మిగతా సబ్జెక్టుల్లో జనరల్ ఆప్టిట్యూడ్ టెస్ట్(జీఏటీ) మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పించనున్నట్టు తెలిపారు. గతంలో పరీక్ష సమయం 45 నిమిషాల నుంచి 60 నిమిషాల వరకు ఉండగా, ఇక నుంచి అన్ని సబ్జెక్టులకు 60 నిమిషాలుగా నిర్ణయించినట్టు చెప్పారు. ఐచ్ఛిక ప్రశ్నలు ఉండవని, అన్ని ప్రశ్నలకు తప్పనిసరి జవాబు రాయాల్సిందేననితెలిపారు. యూజీసీ నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు ఈ మార్పులు చేసినట్టు చెప్పారు.*

**కాంగ్రెస్-సోరోస్ సంబంధాలపై**

## అట్టుడికిన పార్లమెంట్

న్యూఢిల్లీ : అమెరికా బిలియనీర్ జార్జ్ సోరోస్‌తో కాంగ్రెస్‌కు సంబంధాలు, అదానీ అవినీతి అంశాలు పార్లమెంట్‌ను కుదిపేశాయి. సభ ప్రారంభమైన కొద్ది గంటల్లోనే రాజ్యసభ, లోక్‌సభ పలుమార్లు వాయిదా పడ్డాయి. విపక్ష, అధికార పక్షాల నినాదాల నడుమ ఇరు సభలు మరుసటి రోజుకు వాయిదా పడ్డాయి. మోదీ సర్కార్ తీరును నిరసిస్తూ కాంగ్రెస్ సభ్యులు లోక్‌సభలో వెల్‌లోకి దూసుకెళ్లారు. జార్జ్ సోరోస్‌తో సంబంధాలపై సమాధానం చెప్పాలంటూ రాజ్యసభలో జేపీ నడ్డా కాంగ్రెస్‌ను ప్రశ్నించటంతో గందరగోళం ఏర్పడింది. విపక్ష సభ్యులు సభలో అదానీ అవినీతి అంశాన్ని లేవనెత్తారు. మధ్యాహ్నం తర్వాత రాజ్యసభ మరుసటి రోజుకు వాయిదా పడింది.

# 50 దేశాలు.. లక్ష మంది బాధితులు

- ***రోజుకు 8 కోట్లు లూటీ***
- ***రష్యాలో భారీ స్కామ్***
- ***బాధితుల్లో భారతీయులు***



*మాస్కో, డిసెంబర్ 10: రష్యాలో భారీ స్కామ్ వెలుగుచూసింది. భారత్ సహా 50కి పైగా దేశాల్లోని లక్ష మందికిపైగా పౌరులను మోసగించిన నకిలీ కాల్ సెంటర్ గుట్టును ఆ దేశ ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ (ఎఫ్ఎస్‌బీ) ఛేదించింది. పెట్టుబడుల నెపంతో ఈ ముఠా భారత్‌కు చెందని పలువురిని కూడా లక్ష్యంగా చేసినట్టు ఎఫ్ఎస్‌బీ తెలిపింది. దీనికి సంబంధించిన వీడియోను ఎఫ్ఎస్‌బీ షేర్ చేసింది. భారీ యెత్తున మోసాలకు పాల్పడే అంతర్జాతీయ వ్యవస్థీకృత ముఠా ఈయూ, యూకే, కెనడా, బ్రెజిల్, భారత్, జపాన్ ప్రజలను లక్ష్యంగా చేసుకునేది. పెట్టుబడులు, ఇతర ఆర్థిక ప్రలోభాల పేరుతో పౌరులను మోసగించి రోజుకు 1 మిలియన్ డాలర్లు (రూ.8 కోట్లు) వరకు ఆదాయం పొందేది. ఈ కాల్ సెంటర్ ఉద్యోగులు తరచూ భారత్‌కు చెందిన ప్రజలను లక్ష్యంగా చేసుకునే వారు. డిజిటల్ లావాదేవీల్లో ప్రపంచంలోనే అత్యధిక మార్కెట్ ఉన్న భారత్ పౌరులను అధిక వడ్డీ, నకిలీ బీమాల పేరుతో వారి నుంచి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడే వారు. కాల్‌సెంటర్ నిర్వహిస్తున్న ఇద్దరు ప్రధాన నిందితులతో పాటు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. రష్యాలోని పలు ప్రాంతాల్లో ఉగ్రవాద ముప్పును వ్యాప్తి చేయడానికి ఈ కాల్‌సెంటర్‌కు 2022లో ఉక్రెయిన్‌కు చెందిన ఎస్‌బీయూ సెక్యూరిటీ సంస్థ నుంచి ఆదేశాలు వచ్చాయని ఎఫ్‌బీఐ వెల్లడించింది.*